క్లుప్తంగా

30న బోయమాంబ పండగ



పరవాడ: మండలంలోని పి.బోనంగి గ్రామంలో కొలువుదీరిన బోయమాంబ అమ్మవారి పండగను ఈ నెల 30న ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేశారు. పండగను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన చేపల కొర్లయ్య శనివారం వాడచీపురుపల్లి మద్యం దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్న 10 మద్యం సీసాలను ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశామని సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జల్లెలపాలెం వద్ద గుర్తు తెలియని మృతదేహం

పరవాడ: రావాడ శివారు జల్లెలపాలెం సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో చెట్టు కింద 35 ఏళ్ల గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శనివారం కనుగొని పరవాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జల్లెలపాలెం సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో చెట్టు కింద ఉన్న మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. గుర్తించిన వారు 9440796038 నంబర్‌ను సంప్రదించాలని సీఐ ఎస్.బాలసూర్యారావు కోరారు.

పరవాడ మండల సమావేశం రేపు

పరవాడ: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు మండల పరిషత్ సూపరింటెండెంట్ జి.వి.ఎ. రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దొంగతనాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీఐ బాలసూర్యారావు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో తరచూ జరుగుతున్న దొంగతనాలు, చీటింగ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎస్.బాలసూర్యారావు తాడి గ్రామంలో శనివారం ఆన్‌లైన్ మోసాలు, దొంగతనాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ ఎస్.బాలసూర్యారావు వివరించారు. అలాగే సైబర్ క్రైం, లైసెన్స్‌లు, హెల్మెట్ వినియోగం, ర్యాష్ డ్రైవింగ్ వల్ల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కంపెనీ సెక్రటరీల పాత్ర కీలకం



సదస్సులో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: దేశంలో పారదర్శకత, నిజాయితీని సంస్థాగతీకరించడంలో కంపెనీ సెక్రటరీల పాత్ర కీలకమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి.పాండే అన్నారు. ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా (ఐసీఎస్‌ఐ) విశాఖ చాప్టర్ శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కంపెనీ సెక్రటరీ పాత్ర, ప్రాముఖ్యతలను ఉదాహరణలతో వివరించారు. ఐసీఎస్‌ఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సి.ఎస్.ఆర్.వెంకటరమణ విలీనాలు, సమ్మేళనాల గురించి తెలియజేశారు. లీడర్‌షిప్, టీమ్ బిల్డింగ్ గురించి స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, విశాఖపట్నం సెక్రటరీ ఇంతియాజ్ అర్షద్ మాట్లాడారు. ముంబై డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ఎల్.శివశంకర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో చాప్టర్ కంపెనీ సెక్రటరీ మనోజ్ పరాఖ్, కార్యదర్శి సి.ఎస్.చలపతిరావు, 35కు పైగా కంపెనీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



రాయపుర అగ్రహారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



బంగారమ్మపాలెంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ అభిమానులు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

సబ్బవరం: నిబద్ధతతో పనిచేస్తూ ఇచ్చిన హామీలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే,పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. మండలంలోని బంగారమ్మపాలెం,రాయపుర అగ్రహారం, ఎ.శిరసపల్లి, తెలుకులపాలెం,నల్లరేగులపాలెం గ్రామాల్లో శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. అదీప్‌రాజ్‌కు ఆయా గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాలను కుల,మత,పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించిందన్నారు. గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం,వెల్ నెస్ సెంటర్‌లతో పాటు అన్ని రకాలకు మౌలిక వసతులు కల్పించి గ్రామాల రూపురేఖలను మార్చిందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూసే విధంగా తాజా మేనిఫెస్టోలో సంక్షేమ పథకాల నుంచి పొందే లబ్ధిని మరింత పెంచారన్నారు.

పొత్తులతో వంచించడానికే..

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన చూసి భయపడిన చంద్రబాబు పొత్తులతో వంచన చేసేందుకు ప్రజల ముందుకు వస్తున్నారన్నారు.గతంలో 600 పైగా హామీలు ఇచ్చి మోసం చేసిన చంద్రబాబు మరోసారి మాయ చేసేందుకు కొత్త ఎత్తుల వేస్తున్నాడని.. వాటిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్,పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు,పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్,బోకం రామునాయుడు,రాపేటి రాము,పిల్లల అప్పలనాయుడు,పెతకంశెట్టి రామకోటి,కోటేశ్వరరావు,కోరుబిల్లి నూకరాజు,భీశెట్టి వెంకటరావు,కొటాన వెంకట రమణ,ఆర్‌కే, దొడ్డి వెంకటరమణ,సూరిశెట్టి రాము,బొడ్డేటి అప్పారావు,పిల్లల ముసలయ్య,పల్ల రామారావు,కడియాల వెంకట రమణ,నక్కెళ్ల చంటి,దార రాము,గొర్లి కోటి,చిట్టిబోయిన నూకరాజు,చిట్టిబోయిన అప్పలరాజు,దువ్వాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉదయం 8 గంటల నుంచే ప్రచారం

మండలంలోని మొగలిపురం,మల్లునాయుడు పాలెం గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచే ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్,యడ్ల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు,అభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

నవశకానికి శ్రీకారం



మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథం...చెప్పింది చేశాం...చేసేదే చెబుతాం...చంద్రబాబు వలే బూటకపు హామీలు ఇవ్వం...అని చెబుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, పేదలకు ఇళ్లు, మహిళా సంక్షేమం, సామాజిక భద్రతే ప్రధాన అంశాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించారు. వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తూ రూ.25 వేల లోపు జీతం ఉన్న వారికి కూడా తీపి కబురు చెప్పారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో **అన్ని వర్గాల సంక్షేమానికి నవరత్నాలు పేరుతో అందించిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతో** పాటు పలు పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరుస్తూ ఇచ్చిన మేనిఫెస్టోపై వ్యక్తమవుతోంది. – పరవాడ/సబ్బవరం

జగన్‌బాబు మాట ఓ భరోసా



జగనన్న మాట ఇచ్చారంటే కచ్చితంగా అమలు చేస్తారన్న నమ్మకం ఉంది. నా భర్త మృతి చెందారు. నాకు ప్రస్తుతం రూ.3 వేల వితంతు పింఛన్ వస్తుంది. నా కుటుంబానికి భరోసా ఇస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే రూ.3,500 పింఛన్ ఇస్తానని ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉంది. నాకు పింఛన్‌తో పాటు అమ్మ ఒడి,రైతు భరోసా,వైఎస్సార్ ఆసరా వస్తుంది.

– నక్కెళ్ల సన్యాసమ్మ, రాయపుర అగ్రహారం,సబ్బవరం మండలం

మహిళా పక్షపాతి సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజన కారిగా ఉంది. పలు పథకాలు బడుగు బలహీన వర్గాల ప్రజలు, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా రూపొందించారు. వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాల పెంపుతో సీఎం జగనన్న మహిళా పక్షపాతి అని రుజువైంది.

– వెన్నల కమల, వెన్నెలపాలెం

అన్నదాతలకు ప్రయోజనం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోతో ఆయన నిబద్ధత మరోసారి తేటతెల్లం అయింది. రైతు భరోసా, రైతులకు పంట రుణాలు, పెన్షన్ పెంపు పథకాలు అవ్వాతాతలు, రైతులకు మరింత భరోసా ఇచ్చా యి. రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మేనిఫెస్టో రూపొందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– కూండ్రపు అప్పారావు, వాడచీపురుపల్లి

సామరస్య వాతావరణంలో సమస్యల పరిష్కారం

- అందరూ ఓటు వేయాలి
- తహసీల్దార్ తిరుపతిరావు



తహసీల్దారు తిరుపతిరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తుడు



సదస్సుకు హాజరైన గ్రామ ప్రజలు

పరవాడ: సమస్యలుంటే సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు అన్నారు. ఎన్టీపీసీ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న తమ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించక పోతే ఎన్నికలు బహిష్కరిస్తామని మూలస్వయంభూవరం గ్రామస్తులు ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం తహసీల్దారు తిరుపతిరావు, సీఐ ఎస్.బాలసూర్యారావు గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లాంటు ద్వారా ఎగసిపడుతున్న దుమ్ము, ధూళి, వ్యర్థ రసాయనాల వల్ల పెద్దలతో పాటు చిన్న పిల్లలు అనేక వ్యాధులకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోయారు. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకొన్న తమ గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి నివేదించి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటి ఓటు హక్కును విధిగా వినియోగించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని తహసీల్దార్ ప్రజలను కోరారు. సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చించి తమ అభిప్రాయాన్ని తెలియజేస్తామని గ్రామ ప్రతినిధి బాబూరావు చెప్పారు. సదస్సులో వీఆర్వోలు హేమలత, కమల, రజజి, యూత్ నాయకులు ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పరవాడ: వెన్నెలపాలెంలో ఈ నెల 16న చుక్క రమాదేవి ఇంట్లో జరిగిన దొంగతనానికి సంబంధించి అదే గ్రామానికి చెందిన పైల ఉదయ్‌శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. వివరాలు.. గ్రామానికి చెందిన చుక్క రమాదేవి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి పైల ఉదయ్ శ్రీనివాస్‌గా నిర్ధారించుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడిని అక్కయ్యపాలెం బస్టాప్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి బంగారు గొలుసు, బ్రాసలెట్, బంగారు చెవిలీలు స్వాధీన పర్చుకొని అనకాపల్లి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సీఐ బాలసూర్యారావు చెప్పారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలం బావిలో ఈతకు దిగి మృత్యువాత

దేవరాపల్లి: విశాఖ నగరం వేపగుంటకు చెందిన సింగూరు రవికుమార్ (45) అనే విలేకరి పొలం బావిలో ఈతకు దిగి మృతి చెందాడు. ఈ ఘటన దేవరాపల్లి మండలం ముషిడిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి మృతుడు సోదరుడు సుధాకర్ కథనం మేరకు... మృతుడు రవికుమార్ వేపగుంటలోని ఒక స్థానిక పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. అన్నదమ్ములిద్దరూ కలిసి తమ ద్విచక్ర వాహనంపై ముషిడిపల్లి శివారు కొటాన వారి కల్లాలు సమీపంలో విశ్రాంత ఉపాధ్యాయుడు దార్ల సత్యారావు పొలానికి వచ్చారు. సదరు విశ్రాంత ఉపాధ్యాయుడు వారితో కొద్ది సేపు మాట్లాడిన తర్వాత తన పొలం పనిలో నిమగ్నమయ్యాడు. అన్నదమ్ములిద్దరూ అక్కడ సమీపాన బావిలో స్నానానికి దిగి కొద్ది సేపు ఈతకొట్టారు. రవికుమార్ బావిలో మెట్టుపై కూర్చొని ఉండగా, తమ్ముడు సుధాకర్ బయటకు వచ్చేశాడు. తన అన్నను కూడా వచ్చేయాలని పిలిచాడు. ఎంతకీ పలకకపోవడంతో వెళ్లి చూడగా అందులో కనిపించలేదు. ఒకవేళ మునిగిపోయి ఉంటాడని అనుమానంతో సమీప రైతులతో కలిసి వెతకగా, మృతదేహం బయటపడింది. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ డి.నాగేంద్ర పరిశీలించారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య అనురాధ, కుమారులు విహాన్, భన్సీ ఉన్నారు. ఇతడి కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉండగా, రవికుమార్ తన తండ్రి జగన్నాథంతో కలిసి వేపగుంటలో ఉంటున్నాడు.

'కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం నేర్పుతాం'



దీక్ష శిబిరంలో అమృతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. లేకుంటే పోరాటాల ద్వారా ప్రైవేటీకరణ అంశానికి తెరపడేలా చేసి, కేంద్రానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1171వ రోజు, శనివారం ఎస్ఎంఎస్–2 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు.

ముందుగా ఉక్కు పోరాట యోధుడు, దివంగత తమనంపల్లి అమృతరావు 35వ వర్ధంతిని పురస్కరించుకుని దీక్షా శిబిరం వద్ద అమృతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు కార్మికులు సిద్ధమన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి తన నిర్ణయాన్ని మార్చుకుని, ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అమృతరావు స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం



అమృతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అమరనాథ్, నాయకులు

ఉక్కునగరం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో స్టీల్‌ప్లాంట్ సాధనకు ప్రాణాలు పణంగా పెట్టడానికి సిద్ధపడిన దివంగత అమృతరావు స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుంటామని మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమరనాథ్ అన్నారు. అమృతరావు 35వ వర్ధంతి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న అమృతరావు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభించిందన్నారు. గాజువాక, విశాఖ కూడా స్టీల్ ప్లాంట్ వల్ల అభివృద్ధి చెందాయన్నారు. ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా తమ వంతు కృషి చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడానికి కేంద్ర బీజేపీ ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిలబడిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, వై.మస్తానప్ప, మాటూరి శ్రీనివాసరావు, కారు రమణ, బ్రహ్మయ్య, గొందేశి అప్పలరెడ్డి, డేవిడ్ రాజు, ఎన్నేటి రమణ, నడిగట్ల ఎమీమా, మార్పుపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

పెంటమాంబ అమ్మవారికి పంచామృతాభిషేకం



పూజలందుకుంటున్న పెంటమాంబ అమ్మవారు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి శనివారం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పసుపు కుంకుమలతో అర్చించారు. చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ నెల 29న అమ్మవారి అనుపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామని అమ్మవారి ఆలయ ప్రధాన పూజారి శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి సత్యారావు, ఎల్లేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మా గురుకులం మారింది

- రూ.93.55 లక్షలతో గురుకుల పాఠశాలలో వసతులు
- నాడు– నేడు కింద అభివృద్ధి



నూతనంగా నిర్మించిన అదనపు మరుగుదొడ్లు



ఆహ్లాదకరంగా పాఠశాల ప్రధాన భవనం

సింహాచలం: సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల రూపురేఖలు మారాయి. సకల వసతులు సమకూరడంతో నూతన శోభ చేకూరింది. నాడు– నేడులో భాగంగా తొలిదశలో రూ.93.55లక్షలతో పలు అభివృద్ధి పనులు చేశారు. మొత్తం పాఠశాల,కళాశాలలో కలిపి 1128 మంది విద్యార్థులు చదువుతున్నారు. 50మంది వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

నాడు కళా విహీనం

ముఖ్యంగా పాఠశాల భవనాలు రంగులు వెలిసిపోయి కళా విహీనంగా ఉండేవి. డార్మెటరీ, టాయిలెట్లు శిథిలమై అధ్వానంగా ఉండేవి. పాఠశాల నుంచి భోజనానికి వేళ్లే మార్గం వర్షం పడితే బురదమయంగా ఉండేది. అలాంటి పరిస్థితిలో ప్రభుత్వం నాడు– నేడులో నిధులు మంజూరు చేసింది. దీంతో గురుకులం రూపురేఖలు మారాయి.

నేడు కల్పించిన వసతులు

భవన మరమ్మతులు, రంగులు వేయడానికి రూ.45 లక్షల వరకు వెచ్చించారు. డార్మెటరీ, కిచెన్ భవనానికి నూతన రంగులు వేశారు. పాఠశాల భవనం నుంచి కిచెన్‌కు వెళ్లేందుకు విద్యార్థులు పావు కిలోమీటరు మేర నడిచి వెళ్లాల్సి వచ్చేది.మార్గమంతా గతుకులు, మట్టిరాళ్లతో ఉండేది. రూ. 25లక్షలు పెట్టి సీసీ రోడ్డు నిర్మించారు. విద్యుత్ లైన్లు, అవసరమైన చోట కొత్తవి వేశారు. మరుగుదొడ్లు మరమ్మతులు, ఆర్చ్ నిర్మాణం తదితర పనులు చేశారు. ఇటీవల రూ.3.50 లక్షలుపెట్టి అదనంగా పది టాయిలెట్లు నిర్మించారు. దీంతో విద్యార్థులు మా పాఠశాల మారిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నూతన హంగులతో డైనింగ్ హాల్



పాఠశాల నుంచి డైనింగ్ హాల్ వరకు ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

రక్తదానం చేసిన వైద్య విద్యార్థులు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ బ్లడ్ బ్యాంక్, ఎన్ఎస్ఎస్ యూనిట్, ఏఎంసీ బ్లడ్ డొనేషన్ స్టూడెంట్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో శనివారం కేజీహెచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఆరు వైద్య విద్యార్థుల బృందాలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎస్‌పీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మనోజ్ అరవింద్, అనాటమీ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ హేమరాధిక, ఎస్‌పీఎం, మెడిసిన్, ఓబీజీ, పోస్టు గ్రాడ్యుయేట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.